క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి



చిలకలూరిపేట: మండలంలోని కట్టుబడివారి పాలెం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో ఆదివారం చేరారు. వారికి పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ల అధ్యక్షుడు విడదల గోపీనాథ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ పార్టీ విధానాలు, మంత్రి విడదల రజిని నాయకత్వం నచ్చి వైఎస్సార్ సీపీలో చేరినట్లు వారు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో తోట నరసయ్య, తోట బాలకృష్ణ, తోట హనుమాయమ్మ, తోట గోపి, తోట శ్రీనివాసరావు, తోట సుజాత, తోట రామాంజమ్మ, తోట వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బైరా వెంకటకృష్ణ, మాజీ సర్పంచ్ మేరం శ్రీనివాస రావు, మండల జేసీఎస్ కన్వీనర్ బండ్ల శ్రీనివాసరావు, విడదల శేషగిరి ఉన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని జీవీ మాధవరావు ఆఫీస్ నందు వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు చింతలచెర్వు రాఘవేంద్రరావు, మల్లికార్జున శాస్త్రి, గోపాలుని నరసింహారావు, కె.శివరామారావు, పి. రవికుమార్‌ల సహకారాలతో బియ్యం, చీరెలు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సుదీర్ఘకాలంగా సహాయసహకారాలు అందిస్తున్న డి.ఆదిచంద్రశేఖర శాస్త్రి, జి. నాగరాజు, ఎం.మురళీధర్, పి.వరలక్ష్మమ్మలకు మెమోంటో, శాలువాతో సన్మానించారు. కార్య క్రమంలో ఎ.నాగేశ్వరరావు ఎ.వెంకటేశ్వరరావు, పి. సుబ్బారావు, డి.నాగేశ్వరరావు, జె.చంద్రమౌళేశ్వరరావు, సీహెచ్. భద్రయ్య, సీహెచ్. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో సీసీ కెమెరాలు ఏర్పాటు

శావల్యాపురం: మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కన నలు దిక్కులను కవర్ అయ్యేలా ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై తుళ్ళూరి తిరుపతిరావు తెలిపారు. ఆదివారం సీసీ కెమెరాలు పనితీరు స్వయంగా ఎస్సై తిరుపతిరావు పరిశీలించి వ్యాపార సంస్థల నిర్వాహకులకు వివరించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయన్నారు.

షాపు వర్కర్స్ కార్యాలయ భవన ప్రారంభోత్సవం

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి అమ్మవారి దేవస్థానం ఎదురుగా నూతనంగా నిర్మించిన నరసరావుపేట షాపు వర్కర్స్ యూనియన్ నూతన కార్యాలయ భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు, ఆర్యవైశ్య ప్రముఖులు పూరా భాస్కరరావు, కొత్తూరి కిషోర్‌బాబు, జల్లి శ్రీనివాసరావు, దివ్వెల రామకృష్ణ, ఆత్మకూరి రాజేంద్రప్రసాదరావులు హాజరయ్యారు. భవన నిర్మాణానికి గుండా సాంబశివరావు సహకరించారు. షాపు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కంభంపాటి వెంకట సుబ్బారావు, అధ్యక్షుడు నలమోలు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రాచమడుగు సుబ్బారావు, కోశాధికారి నోముల శివశంకరరావు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీ

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో పొలాల్లో ఏర్పాటు చేసిన 16 కె.వి. సామర్థ్యం కల్గిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగలికొట్టి అందులో కాపర్, రాగి తీగ చోరీ చేసిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు గ్రామంలోని నుంచి పరిటాలవారిపాలెం వెళ్లే రహదారి మార్గంలో పొలుట్ల పవన్ కుమార్‌కు చెందిన సాగు భూమిలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నారు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ పగలికొట్టి అందులోని విలువైన సామగ్రిని చోరీ చేశారు. రూ. 2 లక్షల విలువ చేయు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలికొట్టి అందులో విలువైన విద్యుత్ సామాగ్రి చోరీ చేసినట్లు విద్యుత్ ఏఈ సంపెంగుల గాంధీ వెల్లడించారు.

నేడు చక్రాయపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

బొల్లాపల్లి: మండలంలోని చక్రాయపాలెం సచివాలయం పరిధిలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా తెలిపారు. వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించనున్నట్లు తెలిపారు. తొలుత మండల కేంద్రంలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ ఉంటుందన్నారు.

ఆదర్శనీయుడు అబ్దుల్ కలాం

చిలకలూరిపేట: ఆదర్శనీయుడు మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ పీవీ సుబ్బారావు చెప్పారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఏపీజే అబ్దుల్ కలాం కాంపిటిటివ్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.



నరసరావుపేటలో బాల అలంకరణలో చౌడేశ్వరీ అమ్మవారు.



శావల్యాపురంలో బాలత్రిపురసుందరిదేవిగా..



నరసరావుపేటలో బ్రాహ్మీ అలంకరణలో శారదాంబ అమ్మవారు



నూజెండ్ల రవ్వవరం జగన్మాతపీఠంలో బాలత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



అల్లూరివారిపాలెం రోడ్డులో బాల త్రిపురసుందరిగా...



నరసరావుపేటలో బాల త్రిపురసుందరి అలంకరణలో పార్వతీ అమ్మవారు

ఆరంభమైన శరన్నవరాత్రులు



మహంకాళి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



వెల్లటూరులో బాలా త్రిపుర సుందరీదేవిగా..



వితంరాజుపల్లి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన

నరసరావుపేట ఈస్ట్: శ్రీ దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు పట్టణంలోని వివిధ ఆలయాలలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీప కాంతులతో అలంకరించారు. ఆయా ఆలయాలలోని అమ్మవారు తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకరణలతో భక్తులను అనుగ్రహించనున్నారు. తొలి రోజు ఆదివారం అమ్మవారు బాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పాతూరులోని గంగా పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారు, సత్తెనపల్లి రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలోని వాసవీ అమ్మవారు, చెరువుకట్ట వీధిలోని చౌడేశ్వరీ అమ్మవారు, విజయ చాముండేశ్వరీ అమ్మవారు, బరంపేట వాయుమల్లేశ్వర స్వామి ఆలయంలోని రాజ రాజేశ్వరీ అమ్మవారు, రావిపాడు రోడ్డులోని కల్యాణ సుందరేశ్వర స్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారు బాలా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శృంగేరి శంకర మఠంలోని శారదాంబ అమ్మవారు బ్రాహ్మిణి అలంకరణలో హంస వాహనంపై భక్తులను అనుగ్రహించారు.

వినుకొండ ప్రాంతంలో...

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, కామాక్షి కమలేశ్వర ఆలయాలతో పాటు శాంతి ఆశ్రమం ట్రస్ట్ హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో వినుకొండ రూరల్ మండలంలోని వితంరాజుపల్లిలోని సాయి బృందావనం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. హిమాలయ గురూజీ చేతుల మీదుగా శ్రీ స్వర్ణ కవచలంకృత దేవీ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చండీయాగం చేపట్టారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసి అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

రవ్వవరం వెంకటేశ్వర జగన్మాతపీఠంలో...

నూజెండ్ల మండలంలోని రవ్వవరం శ్రీ వెంకటేశ్వర జగన్మాతపీఠంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలి రోజున అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా కుంకుమార్చనలు, లలితా సహస్ర నామ పారాయణం, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన సేవకులు దుర్గేశ్వరరావు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయంలో దసరా శరన్నవరాత్రి వేడుకలు ఆదివారం నుంచి ప్రారంభమైనట్లు ఆలయ ధర్మకర్త రెడ్డి జ్వాల నరసింహారావు తెలిపారు. ఈసందర్భంగా అమ్మవారు మొదటిరోజు బాల త్రిపురసుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలదండలు నూతన వస్త్రాలు వెండి అభరణాలతో అలంకరణ చేశారు. దేవాలయాలన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. ఆలయ పూజారి రావిపాటి సాయిభరత్ సారథ్యంలో ఉభయ దాతలు కాకాని రామాంజనేయులు-అంజమ్మ కుటుంబ సభ్యులచే అమ్మవారికి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బొల్లాపల్లి మండలంలో...

బొల్లాపల్లి: మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లోని దేవాలయాల్లో భక్తులు నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పూజలు నిర్వహించారు. మండలంలోని వడ్డెంగుంట గ్రామంలో జ్ఞాన ప్రసూనాంబ కాళహస్తీశ్వర దేవాలయంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వెల్లటూరు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీ అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

బాల అలంకారంలో...

నరసరావుపేట రూరల్: అల్లూరివారిపాలెం రోడ్డులోని మానసాదేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో శరన్నవరాత్ర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మానసాదేవి అమ్మవారు ఆదివారం బాల అలకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహకులు రంగవఝల కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజాధికాలు నిర్వహించారు.

మహంకాళీ పాహిమాం...

నరసరావుపేట రూరల్: దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఇస్సప్పాలెంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక అలంకారంలో ఉన్న అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న బాలలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన గునుగుంట్ల వెంకటేశ్వర్లు, పద్మావతి దంపతులు రూ.1,00,116లు విరాళాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి చేతుల మీదగా ఈఓ టి.సుధాకరరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ బాబు, కోటప్పకొండ ఆలయ పాలక మండలి సభ్యుడు దివ్వెల రామకృష్ణ పాల్గొన్నారు.

యడ్లపాడులో..

యడ్లపాడు: దేవీ నవరాత్రి మహోత్సవాలు యడ్లపాడు మండలంలో ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ పరిఢవిల్లింది. తొలిరోజున అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవిగా అలంకారకృతరాలై భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయాలతో పాటు జగన్మాత కొలువైన ఇతర ఆలయాల్లోనూ దసరా ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలకేంద్రమైన యడ్లపాడు శివాలయం, అంకమ్మతల్లి ఆలయాలు, లింగారావుపాలెం గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయం, బోయపాలెం పార్వతీదేవి ఆలయం, హరిహరక్షేత్రం, జాలాది హరిహర దత్తక్షేత్రం, తిమ్మాపురం చౌడేశ్వరస్వామి ఆలయం, జగ్గాపురం, మైదవోలు శివాలయాల్లో అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ధర్మకర్తలు, అర్చకులు వివిధ రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు.



నరసరావుపేటలో బాల అలంకరణలో వాసవి అమ్మవారు



రొంపిచర్లలో బాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో వాసవీ కన్యకాపరమేశ్వరి

నాదెండ్లలో...

నాదెండ్ల: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల శోభ మండలంలో సంతరించుకుంది. దసరా తొలిరోజు ఆదివారం అన్ని ఆలయాల్లో అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. గణపవరంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో తొలి ఏడాది దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ పూజారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పాత కోదండరామాలయం, శాంతినగర్‌లో చలువ పందిరిలో బాలత్రిపుర సుందరీగా అమ్మవారు పూజలు అందుకున్నారు. నాదెండ్ల కన్యకాపరమేశ్వరి ఆలయం, సాతులూరులోని విఘ్నేశ్వరస్వామి ఆలయం, శివాలయం, సంతాన వేణుగోపాలస్వామి ఆలయం, కాటి అంకమ్మ, తేనె అంకమ్మ ఆలయాలు, ఎండుగుంపాలెం ఓంకారేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. చందవరం, గొరిజవోలు, చిరుమామిళ్ళ, కనపర్రు, అప్పాపురం, అమీన్‌సాహెబ్‌పాలెం, తూబాడు గ్రామాల్లో అమ్మవారు ప్రత్యేక పూజలు అందుకున్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వివిధ ఆలయాల్లో అమ్మవారు కన్నుల పండువగా కొలువుదీరారు. నన్నపనేని వెంకటరత్నం కళ్యాణమండప ప్రాంగణంలోని శృంగేరి శారదాంబ దేవాలయంలో అమ్మవారు బ్రాహ్మీ అలంకారంలో దర్శనమిచ్చారు. చౌత్రాసెంటర్‌లోని గంగా పార్వతి సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయంలో లలితా పరమేశ్వరీదేవి అలంకారంలో కొలువుదీరారు. దాసరి కాలనీలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో కనకదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వివిధ ఆలయాల్లో సుప్రభాతసేవ, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సహస్రనామ కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి.

నరసరావుపేట పట్టణంలో...

నరసరావుపేట ఈస్ట్: శ్రీ దేవి శరన్నవరాత్ర ఉత్సవాలు పట్టణంలోని వివిధ ఆలయాలలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీప కాంతులతో అలంకరించారు. ఆయా ఆలయాలలోని అమ్మవారు తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకరణలతో భక్తులను అనుగ్రహించనున్నారు. తొలిరోజు ఆదివారం అమ్మవారు బాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పాతూరులోని గంగా పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారు, సత్తెనపల్లి రోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలోని వాసవి అమ్మవారు, చెరువుకట్ట వీధిలోని చౌడేశ్వరీ అమ్మవారు, విజయ చాముండేశ్వరీ అమ్మవారు, బరంపేట వాయుమల్లేశ్వరస్వామి ఆలయంలోని రాజ రాజేశ్వరీ అమ్మవారు, రావిపాడురోడ్డులోని కల్యాణ సుందరేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారు బాలా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శృంగేరి శంకరమఠంలోని శారదాంబ అమ్మవారు బ్రాహ్మిణి అలంకరణలో హంస వాహనంపై భక్తులను అనుగ్రహించారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలో దసరా పండగ పురస్కరించుకొని విప్పర్ల, రొంపిచర్ల, వడ్లమూడివారిపాలెం, కొత్తపల్లి, తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకొని రొంపిచర్ల వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా వందలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో కమిటీ సభ్యులు పర్యవేక్షణలో తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



వడ్డెంగుంటలో బాలా త్రిపుర సుందరీదేవిగా



నరసరావుపేటలో శృంగేరి శంకరమఠం వద్ద విద్యుత్ దీపాలంకరణ



చిలకలూరిపేటలో బ్రాహ్మీ అలంకారంలో శృంగేరి శారదాంబ



గణపవరం కోదండరామాలయంలో బాలత్రిపుర సుందరీదేవిగా



బోయపాలెంలోని పార్వతీదేవి అమ్మవారు



ఎండుగుంపాలెం శివాలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



లింగారావుపాలెం శివాలయంలోని పార్వతీదేవి

శాంతిమార్గం చూపిన దార్శనికుడు మొహమ్మద్ ప్రవక్త

చిలకలూరిపేట: మొహమ్మద్ ప్రవక్త(స) ఆచరించి చూపిన శాంతిమార్గం మానవులంతా ఆదర్శంగా తీసుకోవాలని హైదరాబాద్‌కు చెందిన మతగురువులు సయ్యద్ అహ్మద్‌గౌరీ సాహెబ్, సయ్యద్ సగీర్ అహ్మద్‌సాహెబ్‌లు చెప్పారు. పట్టణంలోని సుభాని నగర్‌లో ఆదివారం సున్నీ జమాత్ ఆధ్వర్యాన మిలాదున్నబీ ఇజ్‌తీమ ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఖురాన్‌లోని అంశాలు, ప్రవక్త జీవిత విశేషాలను వారు వివరించారు. పీర్‌ముర్షిద్ ముక్తారుల్లాషా ఆమిరియా, సజ్జదా ముఫ్తి అబ్దుల్ కలీమా, మౌలానా హాఫీజ్ సాఖిబ్, సుల్తాన్, సాధిక సాహీన్, బాజీసాహెబ్, మునీర్, నగీన్‌సాహెబ్‌లు బయాన్ ప్రసంగం చేసిన వారిలో ఉన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమ నిర్వహణను జాకీర్‌హుస్సేన్, నాయక్ రసూల్, రియాజ్, గోల్డ్ సుభాని, జిలాని, సుభాని నగర్ యూత్ పర్యవేక్షించారు.

ఇదే వేదికపై..

కార్యక్రమానికి విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు విడదల గోపీ, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ దరియావలిను వేదికపై అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని ముస్లిం గోరస్తాన్ కోసం తమ సొంత నిధుల్ని రూ.కోటి అందించారని, అలాగే మద్దినగర్, సుభాని నగర్‌లోని ఖబరస్తాన్ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారని తెలిపారు. సుభాని నగర్‌లోని ఖబరస్థాన్ చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తయిందని, త్వరలోనే కల్వర్టు, రోడ్డు పనులతో పాటు హైవే పక్కన ఉర్దూ స్కూల్ నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముస్లింలకు అన్నీ విధాలా అండగా ఉంటామని తెలిపారు. అభివృద్ధి పనులు చేసినందుకు ముస్లింల తరుపున వారిని శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు.



రఫాని, దరియావలి,విడదల గోపీలను సత్కరిస్తున్న నిర్వాహకులు

45 ఏళ్ల తర్వాత కలిసిన స్నేహబంధం

- 1978-79 పదో తరగతి బ్యాచ్ సందడి
- యడ్లపాడు లూథరన్ హైస్కూల్లో ఆత్మీయ కలయిక

యడ్లపాడు: ఆ పాఠశాలలో పదో తరగతిలో కలిసి చదువుకున్న వారంతా తిరిగి అక్కడే నాలుగున్నర దశాబ్దాల తరువాత కలుసుకున్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడు గ్రామంలోని లూథరన్ హైస్కూల్లో 1978-79 సంవత్సరంలో పదో తరగతి చదివిన 50 మంది బ్యాచ్ ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులుగా 15 ఏళ్ల వయసులో విడిపోయి 60 ఏళ్ల వృద్ధాప్యంలో కలుసుకున్న వారి మదిలో చిన్ననాటి భావోద్వేగాలు ఉప్పొంగాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు, వ్యక్తిగత కుటుంబ విషయాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తాము చదువుకున్న తరగతి గదులు, ఆడుకున్న క్రీడాప్రాంగణాలను చూసుకుంటూ మురిసిపోయారు. నాడు తమకు బోధించిన గురువుల్ని గుర్తు చేసుకున్నారు. సమయం.. ఆకలి మరిచిపోయి ఆప్యాయంగా పలకరింపులు చేసుకున్నారు. ఈ స్నేహబంధాన్ని కొనసాగిస్తూ ఏటా ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలని అంతా తీర్మానించుకున్నారు.

గురువులకు సత్కారాలు.. మిత్రులకు అభినందనలు

నాటి బోధన, బోధనేతర సిబ్బంది జోసెఫ్‌మాస్టారు, సోమరాజు హనుమంత రావులకు పాదపూజ, సన్మానాలు చేసి దీవెనలను అందుకున్నారు. నాటి బ్యాచ్‌కు చెందిన నేటి సీనియర్ జర్నలిస్టులు నిమ్మరాజు చలపతిరావు, ఎడ్ల సునీల్, వైవి రమేష్ బాబు, అలాగే ప్రస్తుతం పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షులు ఆలోకం పెదఅబ్బయ్య, చల్లా యజ్ఞేశ్వర రెడ్డి, నూతలపాటి కాళిదాసు, ముత్తవరపు రామారావు, పోపూరి వెంకట రత్తయ్య ఘనంగా సత్కరించారు. ఈ ఆత్మీక కలయిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన పూర్వ విద్యార్థులు ఆలోకం హరిబాబు, యడ్లపాటి వెంకట రమణమూర్తి, పుసులూరి రంగాచారి, బాపట్ల వెంకట నారాయణ, మైదవోలు హనుమంతరావు, కేశన ముత్యాలరెడ్డి, భాగ్య ప్రకాశమని, పోపూరి పుణ్య కుమారిలను అభినందనలతో ముంచెత్తారు. ఆయా కార్యక్రమాలకు పూర్వ విద్యార్థిని వేగేశ్న అనురాధ అధ్యక్షత వహించారు.



1978-79 లూథరన్ హైస్కూల్లో పదో తరగతి చదివిన విద్యార్థులు

దేశ ఖ్యాతిని ఇనుమడింపచేసిన అబ్దుల్ కలాం

- ఘనంగా అబ్దుల్ కలాం జయంతి
- పల్నాడురోడ్డులో కాంస్య విగ్రహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: దేశ అణు, వైజ్ఞానిక రంగంలో విప్లవాత్మక మార్పులతో మనదేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన మహామేధావి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కీర్తించారు. ఆదివారం మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని పల్నాడు రోడ్డులోని ఆయన కాంస్య విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజాయితీకి, సరళమైన జీవన విధానానికి కలాం ప్రసిద్ధిగాంచారన్నారు. ఆయన శాఖాహారని, మద్యపాన వ్యతిరేకి, బ్రహ్మచారిగా ఉండి ఖచ్చితమైన వ్యక్తిగత క్రమశిక్షణ కలిగిన శాంతి కాముకులు, గొప్ప మానవతావాదిగా జీవించారన్నారు. సృజనాత్మకత, సత్ప్రవర్తన, ధైర్యం మూడింటి మేళవింపును నిజమైన జ్ఞానంగా ఉద్బోధించి విద్యార్థులలో విజ్ఞానాన్ని నింపడానికి ప్రయత్నించారన్నారు. దేశ క్షిపణి వ్యవస్థ పితామహుడిగా పేరు గడించి రాష్ట్రపతిగా ఎనలేని సేవలందించారని, భారతరత్న బిరుదును గడించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, ముదిరాజు, గిరిజన సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్లు ఇయం.స్వామి, పాలపర్తి వెంకటేశ్వరరావు, ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, నియోజకవర్గ మైనార్టీసెల్ అధ్యక్షుడు షేక్ ఖాదర్ బాష, జిల్లా మైనార్టీసెల్ కార్యదర్శి సయ్యద్ ఖాదర్‌బాష, నాయకులు షేక్ కరిముల్లా, షేక్ మాబు, సయ్యద్‌ఖాజా, షేక్ నాగూర్‌వలి, షేక్ సర్దార్ తదితర నాయకులు పాల్గొన్నారు.



పల్నాడు రోడ్డులోని కలాం కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే